క్లుప్తంగా

నేడు 'ఓటరు అవగాహన'

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 3న ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ నియోజకవర్గాల జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, గౌరవ అతిథిగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పాల్గొంటారని పేర్కొన్నారు.

అక్రమ కట్టడానికి నోటీసు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ కడిపికొండ గ్రామ శివారులోని 46వ సర్వే నంబర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి కట్టడాలు నిర్మించడానికి వీలులేదని మున్సిపల్ అధికారులు గురువారం సంజాయిషీ నోటీసు జారీ చేశారు. బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అధికారులు నోటీసులు జారీ చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అనుమతుల్లేని బహుళ అంతస్తులు

వరంగల్ అర్బన్: వరంగల్ భద్రకాళి చెరువు, హనుమకొండ బస్ స్టేషన్ ఎదురుగా, సుబేదారి, హంటర్ రోడ్డు, నయీంనగర్ నాలా మీద అనుమతులు లేకుండా బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారని వినియోగదారుల మండలి ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బహుళ అంతస్తుల నిర్మాణ అనుమతి పత్రాలు ఇవ్వాలని గతేడాది మే 23 ఆర్‌టీఏ ద్వారా విజ్ఞప్తి చేసినా ఇంత వరకు ఇవ్వకుండా బల్దియా అధికారులు జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, న్యాయవాది నలుప రాజు రాజు, వినియోగదారుల మండలి ప్రతినిధులు ఉన్నారు.

శుభ ముహూర్తాలు లేవు

కాజీపేట: మైడాలు, ఆషాఢం మాసం రాకతో సుమారు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని కాజీపేట దక్షిణ ముఖాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ తెలిపారు. పంచాంగ రీత్యా మంచిరోజులు లేని కారణంగా ఈసారి పెళ్లిళ్లు, నూతన గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, శంకుస్థాపనలకు అవకాశం లేదని వివరించారు. జూలై 6నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఆషాఢంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించడం సాధ్యం కాదని చెప్పారు. దాంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి మూడు నెలలపాటు ఉపాధి అవకాశాలు లేనట్టేనని పేర్కొన్నారు.

వడదెబ్బ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

న్యూశాయంపేట: వడదెబ్బకు గురై మృతిచెందిన ఉపాధి కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు తెలిపారు. పనులకు వెళ్లే కూలీలకు పని ప్రదేశాల్లో ఎండవేడిమిని తట్టుకోవడానికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ఉపాధి పనికి వెళ్లిన ఫకీర్ అహ్మద్ వడదెబ్బకు గురై మరణించారని, ఆయన మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

బాక్సింగ్ క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కందుకూరి కాంతయ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సాధన చేస్తున్న క్రీడాకారులకు ట్రస్ట్ చైర్మన్ కందుకూరి మహేందర్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో కోచ్ సందెల శ్యాంసన్, ఇమ్మడి కుమార్, యుగేందర్, రాజేష్ పాల్గొన్నారు.

బస్తీ బడికి ఫ్యాన్ల వితరణ



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా శాయంపేట సుజాతనగర్‌లో బస్తీ బడి విద్యార్థుల కోసం యాక్సిస్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్‌కుమార్ రెండు ఫ్యాన్లను అందజేసినట్లు ప్రేరణ ఫౌండేషన్ ఆర్గనైజర్ పెండ్లి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శ్రీధర్‌కుమార్ కుమారుడు మనోత్రిజల్ జన్మదినాన్ని పురస్కరించుకొని పులిహోర, పండ్లు, స్వీట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సంపత్‌కుమార్, మనోహరస్వామి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు త్వరలో ప్రత్యేక పథకం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: ఉచిత బస్సు పథకం అమలుతో ఆటో డ్రైవర్లకు నష్టం జరిగిందని, త్వరలో వారి సంక్షేమానికి కూడా ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. నయీంనగర్‌లో గురువారం జరిగిన వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికుల పరిచయ కార్యక్రమంలో పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. కడియం కావ్య మాట్లాడుతూ కరోనా సమయంలో కడియం ఫౌండేషన్ ద్వారా ఆటో కార్మికులకు నిత్యావసర సరుకులు, ఉచిత హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు ఆనంద్ మోజెస్, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



నయీంనగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేశాం

హసన్‌పర్తి: ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లోనే రెడ్డి కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. చింతగట్టు క్యాంప్ సమీపంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం రెడ్డి కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రెడ్డి సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించాయని ఎద్దేవాచేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రెడ్లల్లో రాజకీయ చైతన్యం అధికంగా ఉంటుందన్నారు. తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ రెడ్డి సంఘం అధ్యక్షుడు అర్జున కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజిరెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, టీఆర్‌కేరెడ్డి, జయపాల్‌రెడ్డి, పాపిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములతో పాటు కాంగ్రెస్ నాయకులు వెంటరాగా ట్యాంక్‌బండ్‌పై పర్యటించి పనులు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి కడియం కావ్యను గెలిపించాలని అభ్యర్థించారు.

బల్దియా బ్రాండ్ అంబాసిడర్లు.. మెప్మా సిబ్బంది



ప్రశంస పత్రాలు పంపిణీ చేస్తున్న రాధిక గుప్తా

వరంగల్ అర్బన్: మెప్మా సిబ్బంది.. బల్దియా బ్రాండ్ అంబాసిడర్లు అని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అభిప్రాయపడ్డారు. గురువారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. 15-వరంగల్ లోక్ సభ నియోజకవర్గ పరిధి 106-వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి సంబంధించి స్వీప్-24 (సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్-ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో మెప్మా విభాగానికి చెందిన (రిసోర్స్ పర్సన్) ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీలకు ఓటరు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మెహందీ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన 93 మందికి బహుమతులు, ప్రశంస పత్రాలను అందించారు. ఈసందర్భంగా రాధిక గుప్తా మట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక మహిళా బృందాల సభ్యులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని, అందువల్ల వారు బ్రాండ్ అంబాసిడర్లని, స్వీప్‌లో భాగంగా వినూత్నంగా మెహందీ పోటీల ద్వారా ఓటర్లలో చైతన్యం కల్పించడం అద్భుతమన్నారు. ఓటరు ప్రతిజ్ఞలో వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సెక్రటరీ విజయలక్ష్మి, సీడీపీఓ విశ్వజ, టీపీఆర్ఓ రాజేశ్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేశ్, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మరోసారి మోదీ సర్కారు



సమ్మేళనంలో మాట్లాడుతున్న అమర్‌సింగ్

హన్మకొండ: దేశంలో మరోసారి నరేంద్ర మోదీ సర్కారు ఏర్పాటు కావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో గురువారం గిరిజన సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యం లభించిందన్నారు. రాష్ట్రపతిగా ఎస్సీ, ఎస్టీలను చేసిన ఘనత బీజేపీదేనని కొనియాడారు. 400 ఎంపీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందన్నారు. సమ్మేళనంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పార్లమెంట్ ప్రభారి వి.మురళీధర్ గౌడ్, గిరిజన మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర

న్యూశాయంపేట: దేశం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని, పేదలకు అందాల్సిన రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర మోదీ చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం హనుమకొండ రాయపుర ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కావ్యకు మద్దతు కోరుతూ ముస్లిం మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర బాధ్యులు ముజాహిద్ ఇర్ఫాన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. ముస్లింలకు అండగా ఉంటానని, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవీలతారెడ్డి, ముస్లిం మత పెద్దలు ముఫ్తీమినాజ్, డాక్టర్ రాజ్‌మహ్మద్, నదీమ్‌బేగ్, హస్నన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నయీంనగర్: ఓటు హక్కును అర్హులందరూ విధిగా వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.టి.మదన్‌మోహన్ రావు సూచించారు. లష్కర్ సింగారం యూపీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బందితో కలిసి స్వీప్ అవగాహన ర్యాలీని మదన్‌మోహన్‌రావు గురువారం ప్రారంభించారు. సమ్మయ్యనగర్ మీదుగా 100 ఫీట్ రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్‌లో మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, సీహెచ్ఓ మాధవరెడ్డి, బాబు, శ్రీనివాస్, రవీందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

నయీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకుందామని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, కేయూ జేఏసీ, ఓయూ జేఏసీ సంయుక్తంగా గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో మానవతారాయ్ మాట్లాడారు. ఏడాదికి 2కోట్లు ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన బీజేపీ ఓడించి తీరుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 30లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్న బీజేపీకి ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మేడారపు సుధాకర్, వినోద్ నాయక్, తాళ్లపల్లి నరేష్, రమేష్ నాయక్, పాషా, వెంకన్న, సుమన్, సంపత్, సునీల్, తిరుపతి, వెంకట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవతారాయ్

మోసపూరిత పార్టీలను తరిమికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఖిలా వరంగల్: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చే మోసపూరిత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంట, గాడిపెల్లి, దూపకుంట, వసంతాపూర్, స్తంభంపెల్లి, ఆదర్శనగర్ గ్రామాల్లో వేర్వేరుగా గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని, ఇచ్చిన హామీలను మరిచి పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారెపెల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్ గద్దె బాబు, దామోదర్, తుమ్మ సాగర్‌రెడ్డి, సోల్తి భూమాత, ప్రసాద్, కుమార్, బాబురావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

మడికొండ: 46వ డివిజన్ మడికొండ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు వారికి హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాగరాజు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, వస్కుల శంకర్, నాగరాజు, గడుసు రాజు, కల్లెపు నరేష్, వల్లెపు బాలరాజు, కడమంచి సాయిలు, చంద్రమౌళి, రాజేందర్, కనకరాజ్, హరిప్రసాద్, గోపి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన 46వ డివిజన్ కార్యకర్తలు

కాంగ్రెస్‌లో చేరిక

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన తెలంగాణ వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయనతో పాటు పలువురికి తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కండువా కప్పి పార్టీలోకి గురువారం ఆహ్వానించారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



వసుధ



స్వరూప

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి మహిళా పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సింథసిస్ ఆఫ్ న్యూ పెనోథైజెన్ డెరివాటివ్స్ ఆఫ్ పొటెంట్ యాంటీ కేన్సర్ అండ్ యాంటీ సైకోటిక్ ఏజెంట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు వసుధ మల్లంకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి పర్యవేక్షణలో వసుధ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. హైడ్రో బయాలజికల్ సర్వే ఆఫ్ ఏవిఫానా అండ్ ఇక్తియోఫానా ఆఫ్ లోయర్ మానేర్ డ్యామ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కేయూ జువాలజీ విభాగం పరిశోధకురాలు వి.స్వరూపరాణికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో స్వరూపరాణి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆటో బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

మామునూరు: రోడ్డు దాటుతుండగా ఆటోను బైక్ వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని బెస్తం చెరువు కాలనీ వద్ద గురువారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన సంపత్.. వ్యక్తిగత పనిమీద వరంగల్‌కు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. దాంతో సంపత్‌కు గాయాలు కాగా, స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కడియం కావ్యను గెలిపించాలి



వరంగల్: ర్యాలీలో పాల్గొన్న వీరయ్య

వరంగల్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. వరంగల్‌లో జిల్లా కాంగ్రెస్ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షులు బొట్ల సురేష్, చక్రపాణి, నాయకులు పాల్గొన్నారు.

కావ్యకు ఫార్వర్డ్ బ్లాక్ మద్దతు

ఫార్వర్డ్ బ్లాక్ పోటీ చెయ్యని నియోజకవర్గాల్లో ఇండియా కూటమి అభ్యర్థులను బలపరచాలనే రాష్ట్ర పార్టీ నిర్ణయంలో భాగంగా కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు తమ మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ తెలిపారు. ఈమేరకు ఆమెను గురువారం కలిసి సన్మానించారు. అలాగే, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు 14 డివిజన్ మాజీ ఎస్టీఆర్ నగర్‌లో ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం సోషల్ మీడియా మాజీ కన్వీనర్ అడుప మహేష్ నేతృత్వంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అరుంధతి సంఘం ఆధ్వర్యంలో..

కాజీపేట రూరల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు కాజీపేట అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయభాస్కర్ తెలిపారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని గురువారం కలిసి లేఖ అందజేశారు.

ఎస్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన..

హన్మకొండ: కడియం కావ్యను గెలిపించాలని కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ డిపార్ట్‌మెంట్ వరంగల్ జిల్లా చైర్మన్ గుగులోతు రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని రవీందర్ నాయక్ కలిసి కావ్యకు మద్దతు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నయీమొద్దీన్

హన్మకొండ: కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం పూర్వ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నయీమొద్దీన్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మైనారిటీ విభాగం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ముస్లింల పట్ల చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. మంత్రివర్గంలో మైనార్టీలకు స్థానం కల్పించలేదని, పవిత్ర మాసం అయిన రంజాన్‌లో తోఫా ఇవ్వలేదని, 376 మసీదుల్లో దావతే ఇఫ్తార్ చేయలేదని, షాదీ ముబారక్ పథకంలో భాగంగా తులం బంగారం ఇవ్వలేదని, మసీదు ఇమామ్, మోదములకు ప్రతినెలా రూ.10 వేలు ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఇస్మాయిల్, యాకూబ్, సర్దార్, ఇంతియాజ్, గౌస్, యూసుఫ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

'అక్రమ కేసులు పెట్టించడంలో ఘనాపాటి'

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలువురిపై అక్రమ కేసులు పెట్టించడంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఘనాపాటి అని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ ఆరోపించారు. ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం కార్పొరేటర్లు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిట్టని వ్యక్తులపై కేసులు పెట్టించడంలో అతనిది అందవేసిన చేయన్నారు. గద్దం యుగంధర్, దిడ్డి నరేందర్, బండి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుతోపాటు పలువురు వ్యాపారవేత్తలపై నరేందర్‌కేసు నమోదు చేయించారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, చింతాకుల అనిల్, వస్కుల బాబు, సురేష్‌జోషి, బస్వరాజు కుమార్, కావటి కవితాయాదవ్, బైరబోయిన ఉమ, ముస్కమల్ల సుధాకర్, దామోదర్, శిరీష్, కత్తెరశాల వేణు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 1, 3, 5, 2, 4, 6 సెమిస్టర్లకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బాధ్యులు ప్రవీణ్, నరేష్, సాయి, సంతోష్, సురేష్, తరుణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి కళాశాల ఏర్పాటు చేయాలి

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా కేంద్రంగా హోమియోపతి కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లతో పాటు హోమియోపతి, ఆయుర్వేదిక్ యునాని, నేచురోపతి, కోర్సులకు ఒకేసారి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సమావేశంలో నాయకులు చరణ్, రవితేజ, పవన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

న్యూశాయంపేట: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని హనుమకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నుంచి పలువురు వ్యక్తులు సీపీఎంలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాంనగర్‌లోని కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చక్రపాణి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తోందని అన్నారు. నాయకులు వాసుదేవరెడ్డి, చుక్కయ్య పాల్గొన్నారు.

దళితుల ఓట్ల కోసం బీజేపీ మాయమాటలు

ఖిలా వరంగల్: దళితుల ఓట్ల కోసం బీజేపీ నాయకులు మాయమాటలు చెబుతున్నారని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ విమర్శించారు. వరంగల్ శివనగర్ సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఎలేందర్, జన్ను రవి, నిమ్మల మనోహర్, దేవ, రాచర్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో వేసవి క్రీడాశిబిరం

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి కబడ్డీ క్రీడా శిబిరం గురువారం ప్రారంభమైంది. నేతాజీ యూత్ ఆధ్వర్యంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ గౌడ్ కోరారు.

కవితా గోష్ఠికి ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తెలుగు, కన్నడ కవితాగోష్ఠికి హనుమకొండ గోపాలపురానికి చెందిన లెక్చరర్ సాగంటి మంజులను ఆహ్వానించారు. అంతర్జాతీయ సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, కన్నడ సాహిత్య మందిర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కవితా గోష్ఠికి ఆహ్వానం అందడంపై మంజుల హర్షం వ్యక్తంచేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ పెరకవాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, బైక్ మెకానిక్ కూచన దామోదర్ మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను మంత్రి కొండా సురేఖ గురువారం పరామర్శించారు.

మట్టెడ రవీందర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా విధులను నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మట్టెడ రవీందర్‌ను కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు గురువారం సన్మానించారు.

నేటి నుంచి నేషనల్ టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్

మామునూరు: బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర, శని వారాల్లో నిర్వహించనున్న నేషనల్ స్థాయి టెక్నికల్ కల్చరల్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు కోరారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ప్రొఫెసర్ జి.రమేష్, డాక్టర్ కె.మురళీకృష్ణ, మీడియా కన్వీనర్ వి.రాకేష్, మురళీకృష్ణ, రాకేష్ దత్త పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ 49వ డివిజన్ చైర్మన్‌గా సతీష్

హన్మకొండ అర్బన్: 49వ డివిజన్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈగ సతీష్‌ను 49వ డివిజన్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించినట్లు సతీష్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 11 మందికి కోర్టు రూ.11,800 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఏడుగురికి 6,500 జరిమానా విధించినట్లు వివరించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

హన్మకొండ: వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీఎస్ ఎన్పీడీసీఎల్ సీజీఎం కిషన్ గురువారం తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లోని మూడు ఫీడర్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎస్ఈ మధుసూదన్, డీఈ మల్లికార్జున్, ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



ఖిలా వరంగల్: వరంగల్ శాకరాశికుంట కట్ట కరీమాబాద్ రోడ్డుపై శాంతినగర్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట రవీందర్ ఆధ్వర్యంలో పిట్ట చంద్రభాగ, రామస్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ముస్కమల్ల సుధాకర్ మాట్లాడుతూ బాటసారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు.

ఎస్‌వీఎస్ రోడ్డులో..

వరంగల్ చౌరస్తా: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ (ఐసీఏఐ) ఆధ్వర్యంలో జేపీఎన్ రోడ్డులో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. బ్రాంచ్ చైర్మన్ భగవాన్ దాస్, ఇన్‌కం టాక్స్ ఆఫీసర్ ఎ.చక్రధర్, సీఏ ప్రతినిధులు రామకృష్ణ, పరమేష్, దరహాస్ పాల్గొన్నారు.